క్లుప్తంగా

కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవ స్వామి

నగరి: కాలభైరవాష్టమిని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని శ్రీకామాక్షి సమేత కరకంతేశ్వర ఆలయంలోని కాలభైరవ స్వామి సన్నిధిలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, చందనం, పంచామృతం, పన్నీరు, విభూదితో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అభిషేకానంతరం స్వామివారిని పుష్పాలు, వడమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ పూజలు ప్రత్యేకం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం విచ్చేసిన భక్తులందరికీ విభూది ప్రసాదం అందజేశారు.

పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



గాలికుంటు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీవిద్య

శ్రీరంగరాజుపురం: జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు పశువైద్యాధికారి శ్రీవిద్య తెలిపారు. సోమవారం మండలంలోని క్షీరసముద్రం, కొత్తపల్లె, బాలరెడ్డికండ్రిగలో 140 పైచిలుకు పాడి ఆవులకు గాలికుంటు నిరోధక టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ, టీకాలు వేయిస్తే పాడి పశువుల్లో వ్యాధిని నిరోధించి పాల ఉత్పత్తి తగ్గకుండా చేయవచ్చన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి



మేళంబాకంలో టీకాలు వేస్తున్న సిబ్బంది

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్యసౌందర్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ గాలికుంటు వ్యాధి టీకాలు మంగళవారం నుండి అక్టోబరు 15 తేదీ వరకు వేస్తామని అన్నారు. టీకాలు వేసుకోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడిఆవులకు పాలు దిగుబడి తగ్గడం, జ్వరం, చొంగ కారడం, కుంటడం తదితర లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్య సేవలు అందివాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వాన్ని ఇస్తున్న సురేష్‌బాబు

పుత్తూరు: రాష్ట్ర గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం పుత్తూరులో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సంఘ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి సభ్యత్వ నమోదు ఎంతో కీలకమని తెలిపారు. అనంతరం పుత్తూరు తాలూకా యూనిట్ వారికి సభ్యత్వాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో పుత్తూరు తాలూకా యూనిట్ నాయకులు శశిధర్‌రెడ్డి, రాజీవ్, త్యాగరాజు, శశికుమార్, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో చోరీ



చిందరవందరగా బీరువా

పుత్తూరు: స్థానిక ఆచారి వీధిలో తాళం వేసి ఉన్న ఇంటిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు వెంకటప్రసాద్, మమత దంపతులు గత శనివారం ఇంటికి తాళం వేసి తిరుమలకు బయలుదేరి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి చోరీ జరిగినట్లు గుర్తించారు. దుండగులు ఇంటి ప్రధాన ద్వారానికి వేసిన తాళాన్ని రాడ్డు సాయంతో తొలగించి లోనికి చొరబడి బీరువాలోని 30 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.10 వేలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కష్టాల కొలిమి

కమ్మరులు కుటుంబ పోషణకు నానా అవస్థలు పడుతున్నారు. కష్టాల కొలిమిలో దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. కాలానుగుణంగా కులవృత్తికి ఆదరణ కరువవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం సైతం చేయూతనందించకపోవడంతో కూలిపనులకు వెళ్లి పొట్ట పోసుకుంటున్నారు. చేతివృత్తులకు రాయితీపై విద్యుత్ అందిస్తామని ఊదరగొట్టిన కూటమి సర్కార్ ఇప్పుడు చేతులెత్తేసిందని ఆరోపిస్తున్నారు. సబ్సిడీపై రుణాలు ఇప్పించడంలో సైతం మోసం చేసిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.



వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్న కమ్మరి (ఫైల్)

- కమ్మరికి ఆదరణ కరువు
- రాయితీ రుణాలకు అవకాశం కల్పించని ప్రభుత్వం
- అమలు కాని సబ్సిడీ విద్యుత్

పాలసముద్రం: గంగాధర నెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 400 కమ్మర కుటుంబాలున్నాయి. కులవృత్తినే నమ్ముకొని జీవనం గడవక చివరకు కూలి పనులకు వెళుతున్నారు. కనీసం కొలిమి వృత్తిదారులు ఉన్నారనే విషయం కూడా ప్రభుత్వం గుర్తించడం లేదుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చేతి వృత్తులకు విద్యుత్ రాయితీ ఇస్తామని చెప్పిన చంద్రబాబు నేటికీ అమలు చేయడం లేదని వాపోతున్నారు.

అధునాతన పరికరాల రాకతో..

సాధారణంగా జూలై, ఆగస్ట్, సెప్టెంబర్‌లో కమ్మర వృత్తి పనులకు సీజన్ ప్రారంభమవుతుంది. వర్షాకాలంలో పనిముట్ల తయారీ కోసం రైతులు కొలిమి వద్దకు వెళుతుంటారు. ఉపాధి కూలీలు కూడా తమ వ్యవసాయ పనిముట్లకు పదును చేయించుకోవడానికి వెళ్లడం పరిపాటి. అలాగే ట్రాక్టర్ పరికరాల మరమ్మతు కోసం వస్తుంటారు. అయితే ఈ మధ్యకాలంలో అధునాతమైన పరికరాలు రావడంతో కొలిమి పనులకు ఆదరణ కరువైంది. అటు ప్రభుత్వం పట్టించుకోక.. ఇటు ఆదరణ లేక తమ బతుకులు రోడ్డున పడ్డాయని కమ్మరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొలిమి పనులు చేసే కమ్మరుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

గిట్టుబాటు కావడంలేదు



సుమారు 35 ఏళ్లుగా కొలిమి పనులు చేసి జీవనం సాగిస్తున్నా. కుటుంబంలోని అందరం కష్టపడి కొలిమి పనులు చేసి పనిముట్లు తయారు చేస్తాం. వాటిని అమ్మితే రోజూ రూ.250 నుంచి రూ.300 వరకు వస్తుంది. దీంతో ధర గిట్టుబాటు కావడంలేదు. ప్రభుత్వం ఎలాంటి రాయితీలు అందించడం లేదు. –రాధాచ్చారి, బలిజకండ్రిగ

రాయితీ రుణాలు ఇవ్వాలి



కొలిమి పనులు చేసే వారికి ప్రభుత్వం రాయితీపై రుణాలు అందిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. పనిముట్లు తయారు చేయడానికి సబ్సిడీతో షెడ్లు ఏర్పాటు చేస్తే మంచిది. తయారు చేసిన పనిముట్లు ఇతర ప్రాంతాలకు వెళ్లి విక్రయించడం ఇబ్బందికరంగా ఉంది. ప్రభుత్వ మాపై దయ చూపాలి. –మునిరత్నాచ్చారి, తూకుంద్రం

ఆదుకోవాలి



కమ్మర్లు నిత్యం నిప్పు సెగలో ఉండి 40– 50 ఏళ్లకే కొలిమి పని చేయలేక పోతున్నారు. వారికి 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తే మంచిది. పొట్టపోషణకు ఉపయోగపడుతుంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలి. నిరుపేద బతుకులను ఆదుకోవాలి. –రవి, సీఐటీయూ నేత

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ శోభారాణి

కార్వేటినగరం: విధి నిర్వహణలో సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి అన్నారు. సోమవారం మండలంలోని ఆర్కేవీబీపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం ఆమె మాట్లాడారు. చిన్నారుల ఆలనా పాలన విషయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి నెలా పిల్లల బరువును పరిశీలించి వారికి కావాల్సిన పౌష్టికాహారం ఇవ్వాలని, అలాగే బాలింతలు, గర్భవతులకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఆదేశించారు. సిబ్బంది పనితీరుపై గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు

నింద్ర: మండలంలోని రైతులు ఖరీఫ్‌లో తమ పొలాల్లో భూసారం పెంచేందుకు ప్రతి ఒక్కరు జనుము, జీలుగ తదితర పచ్చిరొట్ట సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం రైతులకు జనుము, జీలగ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు జనుము సాగు చేయాలని అన్నారు. రబీలో వివిధ పంటలకు ఎంతో భూసారం పెంచేందుకు వీలుగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలపై సీఎం తీరు దారుణం

- జగనన్న వైద్య విద్యకు పట్టం కడితే.. నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వ
- 17 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై జీడీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి ఆగ్రహం



గంగాధర నెల్లూరు: తమ ప్రభుత్వ పాలనలో జగనన్న వైద్య విద్యకు పట్టం కట్టి, 17 మెడికల్ కాలేజీలు తెచ్చి, ఎందరో పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ కాలేజీల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు వైద్య విద్యను అందకుండా నిర్వీర్యం చేస్తోందని గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి మండిపడ్డారు. గాల్లో మేడలు కట్టే తెలుగుదేశం పార్టీ నాయకులు, మంత్రులకు చత్వారం వచ్చి నిజమైన మెడికల్ కాలేజీ భవంతులు కనబడడం లేదేమోనని వ్యంగ్యంగా అన్నారు. గత ప్రభుత్వంలో మెడికల్ విద్యార్థుల భవిష్యత్తు కోసం 17 మెడికల్ కాలేజీలు అనుమతులు తెచ్చి, నిర్మాణాలు పూర్తి చేసి ఐదు కాలేజీలలో తరగతులు కూడా ప్రారంభించిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ ప్రభుత్వ మెడికల్ కాలేజీ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు సవిత, హోం మంత్రి అనిత అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, దీనికి ఎల్లోమీడియా వంతపాడుతోందని దుయ్యబట్టారు. అంతేకాకుండా పులివెందుల మెడికల్ కాలేజీకి 50 సీట్లు అవసరం లేదని మెడికల్ బోర్డుకు కూటమి ప్రభుత్వం లేఖ రాయడం దారుణమన్నారు. చంద్రబాబు మంత్రులు పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు విరమించుకోవాలని, ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.

అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తే చర్యలు



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం: మండలంలోని తమిళనాడు సరిహద్దులో అనుమతి లేకుండా త గ్రావెల్ తరలిస్తే సంబంధిత వీఆర్‌ఓలపై చర్యలు తప్పవని తహసీల్దార్ అరుణకుమారి హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. ఎర్రమట్టి, గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని, దీనిపై వీఆర్‌ఓలు దృష్టి సారించకపోతే ఉపేక్షించేది లేదన్నారు. రీ సర్వే బాధ్యతగా చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రిషివర్మ, వీఆర్‌లు శ్రీనివాసులు, తంగరాజ్, రమేష్, వెంకటాచలం, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళయరాజాకు ఆర్కే రోజా అభినందనలు



ఇళయరాజాతో మాజీ మంత్రి ఆర్కే రోజా, ఆమె భర్త, కుమారుడు

నగరి: సంగీత దర్శకుడు, ఇసైజ్ఞాని ఇళయరాజాను మాజీ మంత్రి ఆర్కే రోజా అభినందించారు. యాభయ్యేళ్ల సంగీత ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం ఆయనను కుటుంబంతోపాటు వెళ్లి ఆయన నివాసంలో కలిసిన మాజీమంత్రి దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. తన చిత్రరంగ ప్రవేశం ఇళయరాజా సంగీతంతోనే ప్రారంభమైందని, ఆయనతో తమకున్న సంబంధాన్ని మాజీ మంత్రి, ఆమె భర్త దర్శకుడు ఆర్కే సెల్వమణి నెమరు వేసుకున్నారు. ఇళయరాజా గోల్డెన్ హ్యాండ్‌తోనే తాము ఇంతగా ఎదిగామని వారు సంతోషం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ఆర్కే రోజా కుమారుడు కృష్ణకౌశిక్‌ను ఈ సందర్భంగా ఇళయరాజా ఆశీర్వదించారు.

నత్తంకండ్రిగ సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

నగరి: మున్సిపల్ పరిధిలోని నెత్తంకండ్రిగలో వీధి దీపాలు పది రోజులుగా వెలగడం లేదదని, మురుగు కాలువలు లేవని వాటిని ఏర్పాటు చేయాలంటూ సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. నెత్తంకండ్రిగకు చెందిన వారితో మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఆయన ఈ మేరకు వినతిపత్రం అందించారు. అన్ని వార్డులలో దోమలు మందు పిచికారీ చేసి విషజ్వరాల బారిన పడకుండా ప్రజలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బాషా, మహేంద్ర, ముత్తు, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్‌కు వడమాలపేట విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. సోమవారం పాఠశాలలో క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఈ నెల 13న తిరుచానూరులో నిర్వహించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–14, 17, 19 బాల బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారని తెలిపారు. వడమాలపేట పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి తనుష్ 30 కిలోల విభాగంలో, 9వ తరగతి వినయ్‌కుమార్ 46 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని వెల్లడించారు. వీరు అక్టోబర్ మొదటి వారంలో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. హెచ్‌ఎం కరుణానవనీతం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ఉపాధ్యాయ బృందం అభినందించింది.

సప్త కన్నికలమ్మలకు పూజలు



సప్త కనికలమ్మలు, ఏనుగులు, గుర్రాలకు పూజలు

గంగాధరనెల్లూరు: మండలంలోని ఎల్లమ్మ రాజు పల్లె గుట్టలో సప్త కనికలమ్మలకు సోమ వారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. పెద్ద కాల్వ పంచాయతీ ఎల్లమ్మరాజు పల్లె, బట్టు కండిగ, టాన గ్రామానికి చెందిన ప్రజలు 31 ఏళ్లుగా కనికలమ్మలకు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఎల్లమ్మరాజు పల్లె గ్రామస్తులతో కలసి పెద్ద కాలువ పంచాయతీకి చెందిన ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి మహిళలు పొంగళ్లతో ఏనుగులు, గుర్రాలు బొమ్మలతో పురుషులు తల మీద పెట్టుకొని పంబ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా తరలివచ్చారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

తెప్పోత్సవ ఏర్పాట్ల పరిశీలన

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో తెప్పోత్సవ ఏర్పాట్లను సోమవారం ఈఓ పెంచల కిషోర్ పరిశీలించారు. వార్షిక బ్రహ్మోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. ఇందులోభాగంగా ముందస్తుగా తెప్పోత్సవ ట్రయల్ రన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహులు పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా పోటీలు

పుత్తూరు: ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం ఎంఈఓ తిరుమలరాజు ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అనంతరం వాలీబాల్, చెస్ పోటీలను నిర్వహించారు. ఖంఈఓ–2 బాలసుబ్రమణ్యం, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గోపాల్ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం సునీత, మండల కో–ఆర్డినేటర్ గోపీకృష్ణ, పీడీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



నగరికి చేరుకున్న రణభేరిలో ఉపాధ్యాయులు

నగరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం పూనుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) వివిధ ఉపాధ్యాయ, విద్యారంగ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన రణభేరి ప్రచార బైక్ జాతా పలమనేరులో ప్రారంభమై చిత్తూరు మీదుగా నగరి చేరుకుంది. ఈ సందర్భంగా కొమ్మోజి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పీఆర్సీ కమిటీకి సంబంధించి ఎలాంటి పురోగతి లేదని, ప్రభుత్వం వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలన్నారు. అది అమలు జరిగే లోపు 29 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎస్ నాయుడు, జీవీ రమణ మాట్లాడుతూ ఇప్పటివరకు నాలుగు విడతల కరువు భత్యం మంజూరు కాకుండా పెండింగ్‌లో ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ రూపాల్లో చెల్లించవలసిన 26 వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మణిగండన్ మాట్లాడుతూ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి, పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

కొండను చెరబట్టారు

- యథేచ్ఛగా మహారాజపురం కొండపై అక్రమ తవ్వకాలు
- కనుమరగవుతున్న పక్రృతి సోయగం
- కొండ పటిష్టత ప్రశ్నార్థకం



భారీ యంత్రంతో గ్రావెల్ తవ్వేయడంతో దర్శనమిస్తున్న రాళ్లు

విజయపురం: మండలంలోని మహారాజపురం కొండపై మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గత ఏడాదిగా తవ్వకాలు జరుగుతున్నా కొందరి అక్రమార్కుల తీరును అడ్డుకునేవారే కానరావడం లేదు. నాడు పచ్చదనంగా ఉన్న కొండలు నేడు రాళ్లురప్పలతో దర్శనమిస్తున్నాయి. ఓ పక్క చెట్లు పెంచండి అంటూ ప్రచారం చేస్తున్న అధికారులు మరో పక్క పచ్చదాన్ని కూల్చడానికి అనుమతులు ఇవ్వడం ఏమిటని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. ఇటీవల గ్రావెల్ అక్రమంగా తలిస్తూ పట్టుబడిన సంస్థకే మళ్లీ అనుమతులు ఇవ్వడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోరంత అనుమతులతో కొండను తవ్వుతుంటే రెవెన్యూ శాఖ నిద్రమత్తులో ఉందని, కనీసం బిల్లులను కూడా పరిశీలించడం లేదని వాపోతున్నారు.

కొండ పటిష్టత ప్రశ్నార్థకం

కొండ చుట్టూ విలువైన గ్రావెల్ ఉండడంతో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని అక్రమంగా తవ్వుతూ కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. మరోపక్క కొండకు కన్నం వేసి మట్టి తవ్వకాలు చేస్తుండడంతో దాని పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న అధికారుల్లో స్పందన సున్నా. గతంలో పలుమార్లు ఇలాంటి అక్రమ తవ్వకాలను జరుగుతున్నాయని ప్రజలే అడ్డుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అయినా అధికారుల్లో చలనం లేదు.

రాత్రీపగలు తేడా లేకుండా..

తమిళనాడులో గ్రావెల్‌కు పెద్ద డిమాండ్ ఉండడంతో అక్రమార్కులులు రాత్రీపగలూ తేడా లేకుండా లారీల్లో బయటకు తరలిస్తున్నారు. ఇదే తరహాలో అక్రమ మట్టి తరలింపు కొనసాగితే కొండ ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా విజిలెన్స్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు స్పందించి, అక్రమ తవ్వకాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వందల లారీలు



గ్రావెల్ తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్లు

గోరంత పర్మిట్ తీసుకొని కొండను తవ్వేస్తున్నారు. ఒక టిప్పర్ 30 మెట్రిక్ టన్నులు తీసుకెళ్తుంది. ఇలా రోజుకి 100 టిప్పర్లకు 3వేల మెట్రిక్ టన్నుల గ్రావెల్ తమిళనాడుకు తరలుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇలా నెలకు కొన్ని లక్షల మెట్రిక్ టన్నుల గ్రావెల్ తరలిపోతుంటే స్థానిక రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రావెల్ అనుమతి తీసుకున్న సంస్థ రోజుకి ఎన్ని మెట్రిక్ టన్నులు తవ్వుతుందో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులకు ఎంతైనా ఉంది. అయితే ఆ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇష్టంవచ్చినట్లు మట్టి తవ్వి తరలిస్తున్నారు.

సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలి

కార్వేటినగరం: ముఖ్యమంత్రి చంద్రబాబు మండల ప్రజలకు ఇచ్చిన హామీని వెంటనే నెవేర్చాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గౌతం రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నగరి ఆర్డీఓకు అనుపమ, ఉప తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 16నెలలు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమని విమర్శించారు. దీనిపై పోరాటం చేస్తామని పేర్కొన్నారు.